# శృంగార భూతం

చేగొండి రామజోగయ్య



**"నేను జీవిత మంతా లోతుగా పరిశోధించి, అనుభవపూర్వకంగా కనుగొన్న విషయమిది- భూతాలు, దెయ్యాలు ఖచ్చితంగా ఉన్నాయంటే నమ్మరేంటి? నీకెలా నమ్మకం కలిగించాలో తెలియటం లేదు" బాగా విసుగ్గా అన్నాడు ప్రొఫెసర్ దశరథ, పడుచుపెళ్ళాం ధైర్యలక్ష్మితో.**

ఊరికి కొంచెం దూరంగా, ఓ స్మశానానికి దగ్గరలో ఉన్న తమ ఇంటి ఆవరణలో పెద్ద మర్రి చెట్టు కింద కూర్చోబెట్టి, ఓ సాయంత్రం దాదాపు గంట నుంచి, తన జీవితకాల పరిశోధనా సారాంశాన్ని, ఎంత విడమర్చి బోధించినా, భార్యారత్నానికి మాత్రం 'దెయ్యాలు' ఉంటాయన్న నమ్మకం ఏ మాత్రం కలిగించలేకపోయాడు- తను విన్న ఇతరుల అనుభవాలతో పాటు, స్వానుభావాలంటూ ఎన్నివిధాలుగా విపులీకరించి చెప్పినా ప్రయోజనం లేకపోయింది.

'శివుడు' ఉన్నది ఎంత

నిజమో, ప్రేతాత్మలు ఉండటమూ అంతే నిజమని, దృష్టాంతాలతో సహా చెప్పి చూశాడు. దెయ్యాల ఉనికి గురించి చాటి చెప్పిన, పురాణ గాథలు, వాస్తవ ఘటనలు ఎన్ని చెప్పినా ప్రయోజనం కలగలేదు. మానవ జన్మ ఎంత వాస్తవమో, కోరికలు తీరక చనిపోయినవాళ్ళు, దెయ్యాలవుతారన్నది అంతే వాస్తవమని ఢంకా భజాయించి చెప్పేడు. దెయ్యాలన్నీ చెడ్డవి కావని శివుడు వరాలిచ్చినట్లే కొన్ని దెయ్యాలు వరాలిస్తాయని ఉదాహరణకు 'నీ ఇల్లు బంగారం కానూ' అని ఏదైనా దెయ్యం అందంటే, నిజంగానే మనిల్లు బంగారమైతుందని, అదేవిధంగా దెయ్యాలకి కోపం వచ్చిందంటే మనం తట్టుకోలేమని అవి అంత శక్తివంతమైనవని నూరిపోశాడు దశరథ.

అబ్బే ఏం లాభం లేకపోయింది. భార్య ధైర్యలక్ష్మికి ఏ మాత్రం నమ్మకం కలిగించలేకపోయేడు. పైగా వితండవాదం మొదలెట్టింది.

''కోరికలు తీరని మానవులు దెయ్యాలవుతారంటున్నారు కదా. మరి అదేవిధంగా కోరికలు తీరకుండా చచ్చిపోయే ఇతర జీవులు జంతువులు కూడా దెయ్యాలవ్వాలి కదా. ఆ లెక్కన కుక్క దెయ్యాలు, ఎలుక దెయ్యాలు కూడా ఉండాలి కదా'' అని పిచ్చి లాజిక్ తీసింది.

వళ్ళు మండించింది. దాంతో ఎక్కువ ఆలోచించకుండా '' ఆ! ఉంటాయి. మరణానంతరం దెయ్యాలుగా మారే కుక్కలు, పిల్లులు కూడా ఉంటాయి. కానయితే అవి మన జోలికి రావు. కనపడవు. ఆయా జాతుల జీవులకే కనపడతాయి'' అని బుకాయించేశాడు.

''అయితే దెయ్యాలకి మరణముంటుందా? చచ్చిన తర్వాత మళ్ళీ దెయ్యాలవుతాయా?'' అని అమాయకంగా ప్రశ్నించేసరికి ప్రొఫెసర్‌గారు రెచ్చిపోయి పప్పులో కాలేశాడు.

''అబ్బే! నీ తెలివి తెల్లారినట్లే ఉంది. దెయ్యాలకి చావుండదు'' అనేశాడు. బాగా ఉడుకుమోత్తనం వచ్చి కాబోలు–

''దొరికాడు గురుడు'' అనుకుని ధైర్యలక్ష్మి ఇంకా రెచ్చిపోయింది. భర్తని మరింతగా ఆటపట్టించసాగింది లాజికల్‌గానే.

''సృష్టి మొదలైనప్పటినుంచి కొన్ని లక్షల కోట్ల మనుషులు, ఇతర జీవులు, పుట్టి గిట్టి వుంటాయి. ఏ జీవీ తన జీవిత కాలంలో అన్ని కోరికలూ తీర్చుకోలేదు. ఏదో ఒక్క కోరికైనా తీరకుండా చచ్చిపోవచ్చు. మీరు చెప్పిన ప్రకారం ఇన్ని లక్షల కోట్ల జీవులు దెయ్యాలైపోయుంటే వాటికి మరణమే లేకుంటే, ఈ అసంఖ్యాకమైన దెయ్యాలకు, అదే మనిషి దెయ్యాలకు, ఇతర జంతువుల కీటకాల దెయ్యాలకు, సరిపడే చోటుందా ఈ విశ్వంలో? పరిమితమైన జీవితకాలమున్న ఈ మనుష్యులకే సరిపోవటం లేదే ఈ భూమి! అన్నట్టు మగదెయ్యాలు, ఆడ దెయ్యాలు కలిసి పునరుత్పత్తి సాగిస్తే, దెయ్యాల సంఖ్య ఇంకా పెరిగిపోతూనే వుంటుంది కదా. ఇవన్నీ ఉండటానికి చోటెక్కడుందండి బాబూ! అన్నట్టు దెయ్యాలు చెట్లమీదే వుంటాయో, తేలాడుతాయో అన్నారుకదా. అన్నిచెట్లున్నాయా భూమిమీద.. ఉన్న అరణ్యాలను నరికేస్తూ పోతూంటే. రోడ్ల విస్తరణ వంకన, ఉన్న చెట్లనీ నరికేస్తుంటే ఈ దెయ్యాలెందుకు 'ప్రొటెస్ట్' చేయటం లేదు? నోర్మూసుకుని ఉంటున్నాయెందుకు?''

సీరియస్ గొంతుకతో, కొంటెగా అడిగేసరికి ప్రొఫెసర్ దశరథ నోరు పెగలలేదు. సమాధానం చెప్పలేక పళ్ళు పటపట కొరికేడు. నీళ్ళునమిలేడు. ఆఖరికి నిస్పృహగా అన్నాడు అప్పుడే–

''నీకెలా నమ్మకం కలిగించాలో నాకు తెలియటం లేద''ని.

''ఏముంది? ఓ దెయ్యాన్ని తీసుకొచ్చి నాతో మాట్లాడించండి. అప్పుడు చూద్దాం'' దృఢంగా అంది ప్రొఫెసర్ భార్య ధైర్యలక్ష్మి.

ఏం చెప్పలేక నుదురు కొట్టుకున్నాడు.

అప్పుడే.. కీచురాళ్ళ రొదల మధ్య, నక్కల ఊళల మధ్య మర్రిచెట్టు మీదినుంచి ఏదో కిందికి దూకినట్లు ధబేలు మని శబ్దమయింది. భార్యాభర్తలిద్దరూ ఉలిక్కి పడ్డారు. తామిద్దరి మధ్య నిలబడ్డ 'వింత ఆకారాన్ని' చూసి గజగజా వణికిపోయేరు. ఊపిరి పీల్చుకోవటం మర్చిపోయేరు.

ఆ ఆకారం నిస్సందేహంగా దెయ్యమేనని గ్రహించిన దశరథ కొయ్యబారిపోయేడు.

'నిజంగా దెయ్యమే. దెయ్యం ఎలా ఉంటుందని తను ఊహించుకున్నాడో అలానే ఉంది. రామ్‌గోపాల్‌వర్మ సినిమాలో చూసినట్లే ఉంది' ఆంజనేయ దండకం జ్ఞాపకం వచ్చి చావటం లేదు. ఇప్పుడెలా? ఏం చెయ్యాలి?'

ఊపిరాగిపోయినట్లయింది దశరథకి. గాలి స్తంభించింది. లేని గాలికి ఆ ఆకారం కట్టుకొన్న తెల్లని వస్త్రాలు రెపరెపలాడుతూ ఏదో ఒక విధమైన భయంకర సంగీతాన్ని వెలువరిస్తున్నాయి. పైగా దూరాన ఓ నక్క భయంకరంగా మూలిగిన శబ్దం. ముసుగులోంచి చింతనిప్పులా మండుతున్న దానికళ్ళు. కాళ్ళు కూడా నేలమీద ఆన్చినట్లు లేదు. ఆడో మగో తెలియడంలేదు గాని నిస్సందేహంగా దెయ్యమే.

ఇప్పుడెందుకు వచ్చినట్లు? తనని కరకరా నమిలేసి మింగేస్తుందా?

కాదు కాదు.. దెయ్యాల ఉనికిని ససేమిరా ఒప్పుకోనంటూ అపహాస్యంగా మాట్లాడిన తన పెళ్ళాం ధోరణి విని, బుద్ధిచెప్పటానికి వచ్చుటుంది. తనకెందుకు అపకారం చేస్తుంది?' ఇలా పరపరి విధాల ఆలోచిస్తున్న ప్రొఫెసర్ దశరథ, గజగజా వణుకుతున్న శరీరాన్ని అదుపు చేయటానికి విఫలయత్నం చేస్తూ ఏదో అన్నాడు. కాదు అన్నానని అనుకున్నాడు. కాని నోటి నుండి ఏవో వింతవింత శబ్దాలు మాత్రమే వచ్చాయి.

కాని 'దెయ్యమే' ముందు మాట్లాడింది! ప్రొఫెసర్ చెవుల్లో అమృతం నింపింది.

''ఓయ్ ప్రొఫెసర్! దెయ్యాల గురించి నువ్వు చేసిన కృషి, శ్రమ నాకు నచ్చేయి. ఏం కావాలో కోరుకో''

అంతే, దశరథ ఉబ్బి తబ్బిబ్బైపోయాడు. ' ఇది మహా మంచి దెయ్యం. నాకేం అపకారం చెయ్యదు గాక చెయ్యదు' అని నిర్ణయానికొచ్చేడు. తల పైకెత్తడానికి మాత్రం ధైర్యం సరిపోలేదు. తల వంచుకునే ''సార్.. అదే దెయ్యంగారూ! నాకు ఒక లక్ష.. ఆ.. ఆ.. కాదు ఒక కోటి రూపాయలు దయచేయండి..'' ఆలస్యం చేయకుండా భయం భయంగానే అడిగేడు.

''ఓస్ ఇంతేనా! ఈ రాత్రి బాగా నిద్రపోయి, రేపు ఉదయం నీ తలగడ కింద చూసుకో. డబ్బు



మూట ఉంటుంది. విప్పి లెక్క చూసుకో. సరేనా'' దర్జాగా అంది దెయ్యం.

తబ్బిబ్బై పోయేడు ప్రొఫెసర్. అంతలోనే ఇంకా ఎక్కువ డబ్బో, మరింత విలువైనదేదైనా అడగకపోయినందుకు తనను తానే బాగా తిట్టుకున్నాడు. ఏదో అనబోతుండగా వారిస్తూ, భూతం గంభీరంగా పలికింది ఆజ్ఞ రూపంలో.

''అయితే ఒక కండిషన్! నీ భార్యతో కాసేపు ఒంటరిగా గడపాలి నేను''

గుండె గుభేలుమంది దశరథకి.

'ఓమ్మై గాడ్. నా ముద్దుల భార్యనేం చేద్దామని? దెయ్యాల గురించి అపహాస్యంగా మాట్లాడినందుకు శిక్షగా గుటుక్కున మింగేద్దామనా? లేదా తన జాతి ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని, పురాణం ఈ పిచ్చిదానికి చెప్పి, దయ్యాలున్నాయని నమ్మకం కలిగించటం కోసం మాత్రమే ఆమెతో ఒంటరిగా గడపాలనుకుంటున్నదా? ఖర్మ కాలి, ఇది శృంగార తనివి తీర కుండా చచ్చిపోయి దెయ్యం అయిన బాపతా? ఇప్పుడు నా పెళ్ళాన్ని అనుభవించాలని కోరుకుంటున్నదా.. కాదు.. వద్దంటే- అమ్మో అసలే దెయ్యం. కోపం వచ్చి ఇద్దర్నీ కరకరా నమిలేసి మింగేస్తే- బ్రతికుంటే బలుసాకు తినొచ్చు. దెయ్యానికి కోపం తెప్పిస్తే అంతే సంగతులు. అయ్యో దేముడా ఏమిటి దారి.. ఏదో అడుగుదామని కాదు, అర్థించుదామని నెమ్మదిగా కళ్ళెత్తి పైకి చూశాడు.

'అమ్మో! దెయ్యం కళ్ళల్లో మండుతున్న కాఠిన్యాన్ని గ్రహించి, ఇంకేమీ దారి లేదని, అర్జంటుగా నిశ్చయించుకుని భార్యవైపు చూపు మరల్చాడు. నా శీలం పోగొట్టుకోమంటావా అన్న ప్రశ్న ఆవిడ కళ్ళలో ప్రతిఫలించింది.

''ఆ! శీలమా గాడిద గుడ్డా. నువ్వు ధైర్యలక్ష్మివి. మహా పతివ్రతవి. దెయ్యం నిన్నేం చేయదు. అసలు దెయ్యాలకు మానవులకుండేలా శృంగారం, సెక్సు భావనలుంటాయా? ఉండవు గాక ఉండవు. వెళ్ళు, కూడా వెళ్ళు. ఏదో పిచ్చాపాటీ మాట్లాడి తన దారిన తను పోతుంది. అంతే. అసలు దెయ్యాలంటే ఏమిటి? స్పిరిట్. ఉత్త గాలి అన్నమాట. అలాంటి గాలితో కాసేపు 'గడిపితే' శీలం పోవటం లాంటిదేమీ జరగదు. అంతా ఉత్తుత్తినే నన్నమాట. ఉఫ్.. ఉఫ్.. అంతే. అయినా దెయ్యంగారు కాసేపు ఒంటరిగా గడపాలన్నారు. అంతే, ఇంకేమీ డైరెక్టుగా అడగలేదే. మనమెందుకు ఏదో ఊరికినే ఊహించుకోవటం? కాదంటే ఇద్దర్నీ చంపేయడం ఖాయం. ఇద్దరికి ప్రాణభిక్ష పెట్టటం నా చేతిలోనే వుంది. వెళ్ళు.. వెళ్ళు. కాసేపు ఏదో అలా అలా.. ఉఫ్..'' ఇన్ని అర్థాలు గోచరించాయి, ధైర్యలక్ష్మికి తన భర్త పిచ్చి చూపుల్లో, అతనేమీ పైకి మాట్లాడలేకపోయినా!

దెయ్యాన్ని అనుసరించి చీకట్లో కలిసిపోయింది ధైర్యలక్ష్మి. 'ప్రొఫెసర్ ఉన్న చోటునే కొయ్యబారి పోయాడు. ఎన్నో రకాలైన ఆలోచనలు అసంఖ్యాకమైన వికృత దెయ్యాల్లా ముసురుకొన్నాయి. ఎంతసేపు గడిచిందో అర్థం కాలేదు.

కాలం స్తంభించి పోయింది. వళ్ళు, మెదడు మొద్దుబారిపోయాయి. భూతం, తన భార్య ధైర్యలక్ష్మి తిరిగి తన ముందు సాక్షాత్కరించే వరకు ఎంత సేపయిందో అర్థం కాలేదు.

'అమ్మయ్య! నా భార్య నాకు దక్కింది' అనుకున్నాడు.

మనస్ఫూర్తిగా నలిగిన పువ్వులా ఉన్న ఆమె ముఖంలోని భావాల్ని ఆ చిమ్మ చీకట్లో చదవలేకపోయేడు.

ధైర్యలక్ష్మి ఏమీ మాట్లాడలేదు.

''గుడ్‌బై ప్రొఫెసర్'' దెయ్యం దర్జాగా పలికింది.

''సరే.. సరే..'' తత్తర పోవటం దశరథ వంతయింది.

''మరి..మరి..''నోరు పెగల్చుకొని ఏదో అడగబోయాడు. ధైర్యం సరిపోక ఆగిపోయాడు.

''దెయ్యాలు, భూతాలు ఉన్న మాట నిజమైతే నీ కోటిరూపాయల మాట రేపు నీకందుతుంది'' అని గంభీరంగా పలికి మారు మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా ఆ ఆకారం చిమ్మచీకట్లోకి అంతర్ధానమయిపోయింది.

సొమ్ముమూట ఇస్తానన్న దెయ్యం- శృంగార భూతం? మాట నిలబెట్టుకుందో, తప్పిందో మనకెందుకు గాని, వృద్ధ ప్రొఫెసర్‌కి అప్పటినుంచి అనుమాన భూతం పట్టుకుంది.







